# చిత్రం భళారే విచిత్రం

-ఎ. సువర్ణ

ఆ రోజు పొద్దున నిద్ర లేచినప్పటినుంచీ వినీలకు కడుపులో తిప్పి తాగిన కాఫీ అంతా కక్కుకుంది. అప్పుడొచ్చిందామెకు అనుమానం...

తనకు పీరియడ్స్ వచ్చిన తారీఖు చూసుకుంది. అమ్మో! డ్యూ డేట్ దాటిపోయి ఇరవై రోజులైందే. తనెలా ఇన్నాళ్లూ ఆ విషయమే మరచిపోయింది. అంటే... అంటే.. నా కడుపులో ఆ భాస్కర్ రూపం ఊపిరి పోసుకుందన్న మాట.

ఆ పౌర్ణమినాడు జరిగిన దానికి ఫలితం అన్నమాట ఇది. పొత్తి కడుపులోంచి బాధ తెరలు తెరలుగా బాధపెడుతుంటే, వినీలకు తనిప్పుడేం చేయాలన్నదీ బోధపడని అయోమయావస్థలో ఆమెకు జరిగిన పొరపాటు గుర్తుకొచ్చింది.

తల్లిదండ్రులు, తోబుట్టువులు, నా అనే దగ్గర బంధువులెవరూ లేని అనాథ వినీల. టెన్త్ వరకూ చదువుకున్న వినీల ఓ పెద్ద గార్మెంటు ఫ్యాక్టరీలో కత్తిరించి ఇచ్చిన రకరకాల డ్రస్‌లు కుట్టే టైలర్‌గా పనిచేస్తున్నది. ఆమెకు చిత్రకళ అంటే ఎంతో ఇంట్రెస్ట్. బాపూకు మల్లే చిత్రాలు బహు అందంగా పేపర్ల మీద గీస్తుంది. కంటితో చూసినవి, చూడనివి ఊహించి బొమ్మగా పేపరు మీద పెన్సిల్‌తో బొమ్మగా వేస్తుంది.

ఆ రోజు లంచ్ అవర్‌లో భోజనం అయ్యాక, మానవసేవే జీవిత ధ్యేయంగా పెట్టుకుని బతికున్నన్నాళ్లు బాధితుల బాధలను పోగొట్టేందుకనే జీవించిన మానవతా మూర్తి మదర్ థెరెసాను మనసులో ఊహించుకుంటూ పేపరు మీద పెన్సిల్‌తో గీస్తున్నది.

'ఓ అద్భుతం... ఫెంటాస్టిక్...' అంటూ చప్పట్లు కొడుతూ వెనక నుంచి మాటలు వినిపించిన వినీల ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూసి అక్కడున్న అతన్ని చూసి గాభరా పడుతూ లేచి నిల్చుంది. 'సార్... మీరు...' అని భయంభయంగా అంటున్న వినీలను, 'భయపడద్దు వినీలా....' అని అభయహస్తం ఇచ్చిన భాస్కర్... 'మా ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మీరింత అందంగా చిత్రాలు గీస్తారని నాకు తెలియదే...' అన్న భాస్కర్ ఆమె చేతిలోని డ్రాయింగ్ తీసుకుని పరీక్షగా చూసి, 'మదర్ థెరెసా ఎదురుగా కూర్చున్నట్లు తద్ రూపంగా గీశారు. మీకు బొమ్మలు గియ్యడంలో ఇంత నైపుణ్యం ఎలా వచ్చింది?' అడిగాడు భాస్కర్. బాస్ అన్న భయంతో వినీల మాట్లాడలేక పోతున్నది.

'సా...ర్... సా...ర్... అది... అది... చిన్నతనం నుంచీ నాకు చూసినవన్నీ గీయాలనిపించేది పేపరు మీద. ఆ తరువాత పోస్టల్ ద్వారా చిత్రకళ అభ్యసించాను' అని చెప్పి పూర్తిచేసింది వినీల.

'బాగుంది వినీలా... ఓసారి నా చాంబర్‌కు రండి' అని బాస్ చెప్పగానే, అతనెళ్లిన కాసేపటికి బాస్ చాంబర్‌లో భయంభయంగా అడుగుపెట్టింది వినీల. ఫ్యాక్టరీలో పనిచేసేచోట బొమ్మలు వేస్తున్నందుకు ఏం తిట్లు తినాల్సి వస్తుందోనని... ఏమంటారోనని...

వినీల అనుకున్నట్లు భాస్కర్ ఆమెను తిట్టలేదు, మెచ్చుకున్నాడు.

'శభాష్ వినీలా. మీరు రవివర్మనే మించిపోయారు. మీలో ఇంత కళాకారిణి దాగివున్నదని నాకు తెలీదు' అని ఆమెను పొగిడిన భాస్కర్, 'వినీలా! నాకు మా అమ్మ అంటే ప్రాణం. ఆమె ఇప్పుడు జీవించిలేరు. ఆమెదో ఫొటో వున్నది. అది ఇస్తాను, చూసి మా అమ్మదో పెద్ద చిత్రపటం గీసి ఇవ్వగలరా?' అని అడిగాడు.

అప్పటికి ధైర్యం పుంజుకుంది వినీల. 'ఇవ్వండి సార్... ప్రయత్నిస్తాను' అన్న వినీలకు తన పర్సులోంచి తల్లి ఫొటో తీసి ఇచ్చాడు భాస్కర్.

'తొందరేం లేదు. మెల్లిగా గీయండి...'

వినీల బాస్ తల్లి ఫొటోలోని రూపాన్ని బాగా పరిశీలించి చూసి, ఆమె రూపాన్ని మనసులో ప్రతిష్ఠించుకున్నాక చిత్రాన్ని గీయడం ప్రారంభించింది.

రెండే రెండు రోజులలో భాస్కర్ తల్లి చిత్రాన్ని గీసుకొచ్చి వినీల భాస్కర్‌కిచ్చింది. తల్లి చిత్రపటాన్ని చూసి భాస్కర్ పరవశించిపోయాడు.

పర్సు తీసి అందులోంచి రెండు వెయ్యి రూపాయల నోట్లు తీసి వినీలకివ్వబోయాడు భాస్కర్. వినీల తీసుకోలేదు.

'మీరు మీ అమ్మగారి చిత్రానికి వెల కట్టకూడదు. నేను తీసుకోకూడదు' అని భాస్కర్ ఎంత బలవంతపెట్టినా వినీల అతనివ్వబోయిన డబ్బు తీసుకోలేదు. అందుకు మళ్లీ భాస్కర్ పరవశించిపోయాడు.

వినీల గీసిచ్చిన తల్లి చిత్రాన్ని భాస్కర్ పెద్దదిగా లామినేట్ చేయించి ఆఫీసులో తన చాంబర్‌లో తన సీటుకెదురుగా ప్రతిష్ఠించుకున్నాడు.

ఓరోజు భాస్కర్ వినీలతో 'వినీలా! నీలో వున్న ఈ చిత్రకళా నైపుణ్యాన్ని బయటి ప్రపంచానికి తెలియపరచుకోవాలన్న కోరిక లేదా?' అని అడిగాడు.

'ఉంది సార్! అందుకు నన్ను ప్రోత్సహించి నాకు సహాయం సహకారాలందించే నాధుడుండాలిగా!'

'నీకు సహాయ సహకారాలందించే నాధుడుగా నేనుంటాను' అన్న భాస్కర్ ఆమెలోని కళ బయటి ప్రపంచానికి తెలిసేటందుకు తనకు చేతనైనంత సహాయ సహకారాలందించాడు.

బెంగుళూరు చిత్రకళా పరిషత్ చిత్రప్రదర్శనలో ప్రదర్శించిన ఆమె వేసిన, 'వాన రాక కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్న పేద రైతు' చిత్రానికి మొదటి బహుమతి వచ్చింది.

భాస్కర్ కేవలం వినీలకు సహాయం సహకారాలు అందించడంతో ఆగలేదు. మొదట్లో చెప్పినట్లు ఆమెకు నాధుడవాలని కూడా అనుకున్నాడు.

ఓసారి బెంగుళూరులో 'టటిగుని' ఎస్టేట్‌కి తీసుకెళ్లి, ప్రముఖ హిందీ సినీతార, మొట్టమొదటి దాదాభాయ్ ఫాల్కే అవార్డు గ్రహీత అయిన దేవికారాణి భర్త ప్రముఖ చిత్రకారుడు రోరిచ్ వేసిన చిత్రపటాలు చూపించాడు భాస్కర్ వినీలకు. అతని చిత్రకళా నైపుణ్యం ముందు తనెంత అనుకుని అచ్చెరువొందింది వినీల, రోరిచ్ గీసిన అద్భుత చిత్రాలను చూసి.

'వినీలా... నీ చిత్రాలను అమ్మకానికి పెడితే మంచి లాభం వస్తుంది' అన్న భాస్కర్‌తో, 'వద్దండి... నాలోని కళతో వ్యాపారం చేయలేను' అని పోతన తనలోని రచనా సామర్థ్యాన్ని రాజులకు అమ్ముకోలేనని బావమరిది శ్రీనాధునికి చెప్పినట్లుగా వినీల భాస్కర్‌తో అన్నది. అందుకు భాస్కర్ మరింత ముగ్ధుడై ఆమెపట్ల ఆకర్షితుడయ్యాడు.

స్నేహంతో ప్రారంభమై ప్రేమగా రూపాంతరం చెంది అంచెలంచెలుగా పెరిగి వలపుగా మారింది వినీల, భాస్కర్‌ల మధ్య.

గార్మెంటు ఫ్యాక్టరీలో వినీల పనిచేసే చోటుకు తరచూ భాస్కర్ వెళ్లడం, వినీలను తన చాంబర్‌కు పిలవడం, తరచూ సాయంత్రాలు బీచ్, పార్కులకు వెళ్లడంతో తోటి పనివాళ్లు చెవులు కొరుక్కోవడం మొదలుపెట్టారు.

ఓరోజు రామకృష్ణా బీచ్‌లో కూర్చుని మాట్లాడుతుండగా వినీల భాస్కర్‌తో ఈ విషయం చెప్పింది.

'అయితే మనం తొందర్లోనే పెళ్లి చేసుకుందాం' అన్నాడు భాస్కర్. అది వినీలకు మహా సంతోషాన్ని కలిగించింది. అందరు

## నిత్యసత్యం

ఈ లోకమంతా నీచమైన కుతంత్రాలతో నిండిపోయింది. కానీ నైతిక బలం, వివేకం కల వ్యక్తులు వీటి వల్ల ఎప్పుడూ మోసపోరు. లోకం దాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడనీ, నేను ధర్మమార్గాన్నే అనుసరిస్తాను. ఇది ధీరుని విధానం అని తెలుసుకో.

లేకపోతే రాత్రింబవళ్ళు "వీడు ఏమన్నాడు, వాడు ఏమన్నాడు" అని చూస్తూంటే ఈ లోకంలో ఏ మహత్కార్యము సాధ్యం కాదు.

– స్వామి వివేకానంద

*సేకరణ: పి. గోవిందరావు*




ప్రేమికులకు మల్లే భాస్కర్, వినీలలు మహా జోరుగా షికార్లు సాగించారు.

కార్తీక మాసంలో ఓ పౌర్ణమి రాత్రి వన భోజనాలు చేద్దామన్నాడు భాస్కర్. 'మనిద్దరమేనా' అని అడిగిన వినీలకు 'అవును' అని చెప్పాడు భాస్కర్. వినీల అతనితో పెళ్లి కాకుండా ఒంటరిగా రాత్రిపూట భోజనం చేయడానికి భయపడింది. అతనిచ్చిన ధైర్యంతో ఒప్పుకుంది.

ఆ రాత్రి వన భోజనంతోపాటు వెన్నెల భోజనం కూడా చేశారు ఆ ప్రేమికులు. ఎంత నిగ్రహపరులైనప్పటికీ ఏకాంతం, వాతావరణం వాళ్ల నిగ్రహాన్ని ఎగరగొట్టేస్తుంది... ఫలితం... షరా...

'నువ్వేం దిగులుపడకు వినీలా... రేపే పురోహితుడితో మాట్లాడి వారంలోగా నీ మెడలో నేను మూడు ముళ్లు వేస్తాన'ని దిగులుగా వున్న వినీలకు ధైర్యం చెప్పాడు భాస్కర్. కానీ అలా జరగలేదు. భగవంతుడు జరగనివ్వడు.

రాజధానికి వెళ్లగానే పెళ్లి చేసుకుంటానని చెప్పి వెళ్లిన దుష్యంతుడు శకుంతలను పూర్తిగా

మరచిపోయాడు. అందుకు ముని శాపం కారణమని కాళిదాసు దుష్యంతుణ్ణి సమర్థించాడు తన 'అభిజ్ఞాన శాకుంతలమ్'లో. అలాగే వినీలను పెళ్లి చేసుకోకపోవడానికి భాస్కర్‌కు ఓ వంక దొరికింది.

భాస్కర్, వినీలలు శారీరకంగా ఒకటైన మర్నాడు పురోహితుని వద్దకెళ్లి పెళ్లికి ముహూర్తం పెట్టించుకుని రావాలని బయలుదేరుతుండగా, ఓ విదేశీ కంపెనీ నుంచి కొంతమంది విదేశీయులు వ్యాపారం గురించి భాస్కర్‌తో మాట్లాడేందుకు వచ్చారు.

వాళ్లకు దాదాపు అన్ని దేశాలలోనూ గార్మెంటు ఫ్యాక్టరీలు ఉన్నాయి. బెంగుళూరులోని కిడ్స్ క్యాంప్, హైదరాబాద్‌లోని చర్మాస్, రెడీమేడ్ దుస్తుల షోరూమ్‌లెన్నింటికో వాళ్లే రెడీమేడ్ డ్రస్‌లు సప్లయ్ చేస్తారు. మంచి లాభాలతో వ్యాపారాన్ని నడిపిస్తున్న వ్యాపారవేత్తలు భాగస్వాములై వ్యాపారాభివృద్ధి చేయాలనుకుని రావడం భాస్కర్‌కు అదృష్టం, వరం అయితే, వినీల పాలిట అది శాపం అయింది.

కొన్ని కోట్లు ఖరీదు చేసే నూతన యంత్రాలు విదేశాల నుంచి భాస్కర్ ఫ్యాక్టరీకి వచ్చాయి. ఆ మిషనరీ ఎరక్షన్ చేసి నడిపించడానికి అతని ఫ్యాక్టరీలోని వర్కర్స్‌కు ట్రైనింగ్ ఇవ్వడానికి ముంబాయి నుంచి ఒక నిపుణుడు వచ్చాడు.

అతని పేరు దీక్షితులు. పదహారణాల ఆంధ్రుడు. కోనసీమకు చెందినవాడు. దీక్షితులు ముంబాయి నుంచి విశాఖపట్నంకు విమానంలో వచ్చి వెళుతుండేవాడు.

ఈ హడావిడిలో భాస్కర్ వినీలను పూర్తిగా మరచిపోయాడు. పొద్దున ఆరు గంటలకు లేచింది మొదలు రాత్రి పన్నెండు గంటలకు పడుకునేంత వరకు ఫ్యాక్టరీ పనుల్లో మునిగి తేలి అలసిపోయి పక్కమీద పడుకున్న తక్షణం భాస్కర్‌కు ఒళ్లు తెలీకుండా నిద్రపట్టేది. నిద్రలో కూడా కంపెనీ గురించిన కలలే కానీ, వినీల ఆకలల్లోకి కూడా రాలేదు.

తన పరిస్థితి తెలుసుకున్న వినీల భాస్కర్‌ని కలుసుకుని తాము వెంటనే పెళ్లి చేసుకోవాలని చెప్పాలని ఎంత ప్రయత్నించినా భాస్కర్‌ని కలవడానికి, మాట్లాడటానికి అవకాశం దొరకడం లేదు.

కొత్త యంత్రాలతో, కొత్త వర్కర్లతో పనులు ప్రారంభం అయ్యాక కంపెనీ పనులన్నీ చూసుకునేందుకు ఓ మేనేజర్‌ని నియమించాడు భాస్కర్. అప్పటి నుంచీ భాస్కర్ ఫ్యాక్టరీకి పొద్దున ఓసారి, సాయంత్రం మరోసారి వచ్చి ఒక్క గంట మాత్రం వుండి వెళ్లిపోతున్నాడే కానీ, వినీలను గురించి పట్టించుకోవడం లేదు.

ఎన్ని విధాల ప్రయత్నించినా వినీల భాస్కర్‌ని ఫ్యాక్టరీలో కలుసుకోలేక, శకుంతలే దుష్యంత మహారాజు వద్దకు బయలుదేరినట్లుగా, అడ్రసు తెలుసుకుని భాస్కర్ బంగళాకు బయలుదేరింది ఓ సాయంత్రం ఫ్యాక్టరీ పని పూర్తయ్యాక. కానీ, భాస్కర్ ఊళ్లో లేడని వాచ్‌మెన్ చెబితే ఉసూరుమంటూ వెనక్కి వచ్చేసింది వినీల. భాస్కర్ ఏ ఊరు వెళ్లాడో తెలీదు.

మర్నాటినుంచీ వినీలకు వేవిళ్లు ఎక్కువగా వుండడం వల్ల ఫ్యాక్టరీకి వరుసగా మూడు రోజులు వెళ్లలేదు.

రాత్రింబవళ్లు తను తప్పు చేశానా అని వినీల బాధపడని క్షణం లేదు. అయినా భాస్కర్ మీద పూర్తిగా నమ్మకం పోగొట్టుకోని ఆ అబలకు ఆ నమ్మకం పోగొట్టుకోవలసిన సమయం మర్నాడే వచ్చింది.

మర్నాడు పనిలోకి వచ్చిన వినీల మిషన్ ముందు కూర్చోగానే తనతోపాటు పనిచేసే పద్మ పరిగెత్తుకుంటూ వచ్చి, 'వినీలా, ఇదిగో లిస్టు. ఈ లిస్టులో వున్న పనంతా నిన్ను ఇవాళే పూర్తిచేయమని ఎమ్.డి. చెప్పారని మేనేజరు చెప్పారు' అని చెప్పిన కొలీగ్‌ని వినీల 'నిన్న ఎమ్.డి. ఫ్యాక్టరీకి వచ్చారా' ఆదుర్దాగా అడిగింది.

'ఆ... వచ్చాడు' 'ఇవాళ... 'రారు...'

'నిన్న వచ్చినప్పుడు ఆయన నా గురించి ఏమీ అడగలేదా! అదే, నేనెందుకు ఫ్యాక్టరీకి రాలేదని?'

'ఊహూ... అసలాయన ఇదివరకటిలా ఫ్యాక్టరీ లోపలికే రావడం లేదు. ఆఫీసుకొచ్చి అటునుంచే వెళ్లిపోతున్నారు. ఇవాళ రానని నిన్నే

చెప్పారట!'

'ఏం... ఎందుకని?' 'ఇవాళ ఆయనకు ఎంగేజ్‌మెంటుట...'అన్న పద్మ మాటకు వినీలకు నెత్తిమీద పిడుగుపడ్డట్లయింది.

'ఆయనకు... మన ఎమ్.డి. గారికి మరో అమ్మాయితో పెళ్లా... ఎవరా అమ్మాయి...' అడిగింది వినీల.

'మరో అమ్మాయి అంటావేంటి వినీలా ఆయనకింకా పెళ్లవలేదుగా...'

'ఆ... పెళ్లి అవకపోవడం ఏమిటి? నన్ను గాంధర్వ వివాహం చేసుకున్నారుగా...' కోపంగా మనసులోనే పళ్లు కొరికింది వినీల.

'ఇంతకీ మన ఎమ్.డి.ని వరించిన ఆ అమ్మాయి ఎవరు పద్మా...?'

'ఎవరో కాదు... మన ఎమ్.డి. గారు వరించలేదు. మన ఫ్యాక్టరీలో కొత్త మిషన్లు బిగించడానికి రాలేదూ...!'

'ఎవరు...? ఆ దీక్షితులుగారా...?' 'ఆ... అవును, ఆయన చెల్లెలుతో మన ఎమ్.డి. గారికి పెళ్లి నిశ్చితార్థం ఇవాళ...' అని పద్మ చెప్పిన దాంతో వినీల మనసంతా చేదుగా అయిపోయింది. వెంటనే వెళ్లి భాస్కర్‌ని నిలదీయాలనుకుంది వినీల. ఎలాగైనా ఆ నిశ్చితార్థం ఆపుచెయ్యాలని నిశ్చయించుకుంది. కానీ వెంటనే తను నిశ్చితార్థాన్ని ఆపగలనా... అన్న ఆలోచన వచ్చి వణికిపోయింది వినీల.

'నిజంగా భాస్కర్ నాతో స్నేహం చేసి, ప్రేమించి, వలచి, వలపించుకుని, పెళ్లి చేసుకోకుండానే నన్ను గర్భవతిని చేసి, ఇప్పుడు నన్ను మరిచిపోయి మరో అమ్మాయి మెడలో తాళి కట్టడానికి సిద్ధపడుతున్నాడంటే, ఆనాటి విశ్వామిత్రుడు, దుష్యంతుల మాదిరిగానే ఆడవాళ్లను మోసం చేసి తల్లులను చేసే మగవాళ్ల ప్రవృత్తిలో మార్పే రాలేదన్నమాట' అని ఆమె వేసుకున్న ప్రశ్నకు ఆమే సమాధానం చెప్పుకుంది.

'పిచ్చి పిల్లా... ఇదేనే ఆడవాళ్ల తలరాత అనే కంటే ప్రకృతి ధర్మం అంటేనే బాగుంటుంది... వాడి శారీరక అవసరంకొద్దీ ఆడదాన్ని నమ్మించాల్సి వస్తోంది... నమ్మిస్తున్నాడు... అవసరం తీర్చుకుంటున్నాడు... మరచిపోతున్నాడు... ప్రకృతి తన ధర్మం నెరవేరుస్తున్నది... ప్రకృతిలోనూ మార్పు లేదు... స్త్రీ మోసపోవడంలోనూ మార్పు లేదు... ఎటొచ్చీ మగవాడు మోసం చేసే విధానంలోనే మార్పు వచ్చింది... పాత మార్గాలలో స్త్రీని మోసం చేస్తే నమ్మదని కొత్త విధానాలను ఎంచుకుంటున్నారు ఆధునిక యుగంలోని పురుషులు... ఇదేనే పిచ్చిపిల్లా! తరతరాలుగా జరుగుతున్న చరిత్ర... మగవాణ్ణి నమ్మి ఆడది మోసపోతూనే వుంది.'

'ఆనాటి శకుంతల నుంచీ నేటి వినీల వరకూ జరిగిన మోసం ఒకటే' అని మనసు చెప్పిన మాటలకు వినీల వణికిపోయింది. కానీ అమాయకురాలు వినీల భాస్కర్ తనని మోసం చేయడనే ఇంకా నమ్ముతోంది. ఒక్కోసారి కన్నవి, విన్నవి నిజం కాకపోవచ్చు. ఒకసారి భాస్కర్ బంగళాకి వెళ్లి అతనితో మాట్లాడాకే ఓ నిర్ణయానికి రావాలని నిశ్చయించుకున్న ఆమె, వెంటనే ఆటో

## వృద్ధాప్యం

బాధ్యతలు తీరిపోయాయి
బంధనాలు సడలిపోయాయి
రెక్కలొచ్చిన పక్షులు
గూట్లోంచి ఎగిరిపోయాయి
శక్తికి మించి సేవ చేశాను
రక్తి లేక విసిగిపోయాను
అనంతమైన ఈ లోకంలో
అంతులేని నా కోరికలకు
సమాధి కట్టబడింది
నేనిక పనికి రాని జీవిని
బ్రతికి ఉన్న నిర్జీవిని
అందుకే ప్రభూ
నాకిక విముక్తిని కలిగించు
ముక్తిని ప్రసాదించు

– వై.కె. మూర్తి

పట్టుకుని ప్రేమికుని బంగళాకు బయలుదేరింది. శకుంతలే దుష్యంతుణ్ణి వెతుక్కుంటూ అతని రాజ్యానికి బయలుదేరినట్లు... శకుంతలలానే వినీలకు అక్కడ అవమానమే ఎదురైంది.

భాస్కర్ బంగళా జనంతో కోలాహలంగా వుంది. పట్టుచీరలు, నగలతో ధగధగలాడుతున్న స్త్రీలు, రకరకాల సూట్లు, టైలు ధరించిన పురుషులతో కళకళలాడిపోతున్నది. భాస్కర్ సఫారీ సూటులో మెరిసిపోతున్నాడు. స్పీకర్లలోంచి చిట్టిబాబు వీణానాదం మధురంగా వినిపిస్తున్నది.

అతిథులను నమస్కరిస్తూ ఆహ్వానిస్తున్న భాస్కర్‌ను, 'అయ్యా... శుభ ముహూర్తం ప్రవేశించింది. తమరు లోపలికొచ్చి తాంబూలాలు పుచ్చుకోండి...' అని పిలిచాడు పురోహితుడు. పెళ్లికూతురు అన్నగారు, భాస్కర్ తరపున ఎవరూ లేనందున భాస్కరే తన పెళ్లి తాంబూలాలు ఇచ్చిపుచ్చుకున్నాడు. పెళ్లి తేదీ, ముహూర్తం నిర్ణయించి పురోహితుడు లగ్నపత్రిక రాసి అందరికీ చదివి వినిపించాక ఎంగేజ్‌మెంటుకని వచ్చిన అతిథులందరూ కరతాళ ధ్వనులు చేసి తమ ఆనందాన్ని తెలియపరుస్తుండగా వినీల పరుగులాంటి నడకతో అక్కడికొచ్చింది.

భాస్కర్, అతనికి కాబోయే భార్య మెడల నిండుగా పూలహారాలతో నిలబడి వుండగా, కెమెరాలు, వీడియో కెమెరాలతో వారిని రకరకాల ఫోజులతో ఫొటోలు తీస్తున్నారు, వీడియో తీస్తున్నారు. వాళ్లకు ఫోజులిస్తున్నారు వాళ్లు.

'ఇది న్యాయమా... ధర్మమా... నన్ను పెళ్లాడతానని నమ్మించి, నన్ను తల్లినయ్యేట్లు చేసి ఇప్పుడు మరో అమ్మాయి మెడలో తాళి కట్టడానికి సిద్ధపడటం ధర్మం కాదు...' అని అతనినడిగితే, 'నీ కడుపులోని బిడ్డకు నేనే తండ్రినన్న గ్యారంటీ ఏమిట'ని అడిగితే తనెలా నిరూపించగలదు. ప్రతి స్త్రీలో మరో జీవి ప్రాణం పోసుకోవడానికి కారకుడు పురుషుడే. అందులో ఏ విధమైన సందేహానికి తావు లేదు. అందుకే ఆడది, మగాడు పెళ్లి చేసుకున్నాక, ఆడది గర్భవతి అయితే అందుకు కారకుడు ఆమె భర్తే అని అందరూ అంగీకరిస్తారు. పెళ్లికాని తల్లులు తమ కడుపులోని బిడ్డకు కారకుడు ఫలానా పురుషుడని తెలిసి చెప్పినా ఆ పురుష పుంగవుడు ఒప్పుకోడు.

'జాబాలి, సత్యకామల కథ అందరికీ తెలిసిందే. సత్యకాముని శిష్యునిగా చేసుకోదలచిన గురువు అతని తల్లినడిగి తండ్రి పేరు, గోత్రం తెలుసుకు రమ్మంటాడు. అనేక మంది పురుషులతో సంపర్కం వున్న సత్యకాముని తల్లి అతని తండ్రి ఎవరని చెప్పగలనని అడుగుతుంది. అలా కాకుండా పెళ్లి అంటూ అయ్యాక బిడ్డను కంటే ప్రపంచం ఆ బిడ్డ తండ్రి ఆ భర్తేనని పూర్తిగా విశ్వసిస్తుంది' అని వినీల ఎన్ని విధాలుగా ఆలోచించి, ఏదైతే అదే అవుతుందని భాస్కర్‌ని నాలుగూ అడగకుండా అక్కడి నుంచి కదలకూడదనుకుంది.

నాలుగు పక్కలా పరికించి చూస్తున్న భాస్కర్ కంట వినీల పడింది. వెంటనే ఖంగుతిన్నాడు. మొహం ముడుచుకుని చూపులను వేరే పక్కకు తిప్పుకున్నాడు.

మెల్లిగా అందరినీ తప్పించుకుని వినీల వద్దకు వచ్చాడు భాస్కర్.

'నువ్వెందుకొచ్చావిక్కడకు...?' కోపంగా అడిగాడు భాస్కర్ ఆమెను.

'నేనెందుకొచ్చిందీ చెప్తే... నాకు కావలసింది ఇస్తావా భాస్కర్...?' కళ్లనీళ్లతో అడిగినా వినీల మాటలలో కోపం ధ్వనిస్తున్నది.

'లోపలకెళదాం... పద!' అని భాస్కర్ ఆమెను తన పర్సనల్ రూమ్‌కు తీసుకొచ్చి తలుపు గడియ పెట్టాడు.

'ధనవంతుల బుద్ధి పోనిచ్చుకోలేదే... నమ్మించి నా గొంతు కోస్తారా...?'

'ప్లీజ్ వినీలా నన్నర్థం చేసుకో...!'

'మిమ్మల్ని అర్థం చేసుకునేదేమిటి... నా నిరాడంబరత్వాన్ని చూసి, నాలోని చిత్రకళా నైపుణ్యాన్ని మెచ్చుకుని నన్ను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, దేవుని ముందు ప్రమాణం చేసి, నన్ను తల్లిని చేసి, ఇప్పుడు అతి నీచంగా, బజారు మగాడిలా మాట్లాడటం బాగోలేదు... న్యాయంగా లేదు...!'

'సారీ వినీలా! నిన్ను మోసం చేయాలనే ఉద్దేశ్యం నాకెంత మాత్రం లేదు. వ్యాపారం

కారణంగా నేనీ పెళ్లి చేసుకోక తప్పలేదు. నన్ను నమ్ము... వినీలా!'

'భేష్! సార్... భేష్! దుష్యంతుడి మాటల్లాను వున్నాయి మీ మాటలు...'

'మరి ఇప్పుడు నేనేం చేయాలి... ఏం చేయమంటారు...?'

'అబార్షన్ చేయించుకో... నేను డబ్బిస్తాను...!'

'ఎందుకు? అబార్షన్ చేయించుకునేందుకా... అబార్షన్ చేయించుకునేందుకు మీరే డబ్బివ్వక్కర్లేదు. అంత మాత్రం డబ్బు నా దగ్గర వుంది...'

'ఇంకేం... చేయించుకొచ్చెయ్... ఫ్యాక్టరీలో ప్రమోషన్ ఇచ్చి జీతం పెంచుతాను. నీలోని చిత్రకళా నైపుణ్యం ప్రపంచం అంతా చూసి మెచ్చుకుని ప్రశంసించేట్లు చేస్తాను...' అన్న అతని మాటలు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.

'అబార్షన్ చేయించుకోవాలా... నాకేం మానాభిమానాలు లేవనుకున్నావా... నీకు మల్లే...' కోపంతో ముక్కులదిరిపోతూ భాస్కర్‌ని ఛెడామడా తిట్టేసింది వినీల. 'ఏయ్! వినీలా... మాటలు మర్యాదగా రానియ్... మెత్తగా నా తప్పు ఒప్పుకుని నీకో పరిష్కార మార్గం చూపిస్తుంటే...'

'ఇదా నాకు నువ్వు చూపించే పరిష్కారం...? నేను బజారు దాన్ననుకున్నావా... వేశ్యననుకున్నావా... నాతో ఇప్పుడే పదిమంది మధ్యకి రా... నువ్వు చేసిన అన్యాయం అందరికీ చెప్తాను... నువ్వు నా మెడలో తాళి కట్టాలంటాను...'

'ఓ... నీకంత ధైర్యం వచ్చిందా... ఇది నా బంగళా... ఇక్కడున్న వాళ్లందరూ నా వాళ్లు... నా మాటలు నమ్ముతారే కానీ, నీ మాటలెవరూ నమ్మరు... నన్ను అవమానపరచాలనుకుంటే నువ్వే అవమానం పాలవుతావు.... అనవసర పంతాలకు పోయి అవమానం పాలవకుండా బుద్ధిగా నేను చెప్పినట్లు చెయ్... బాగుపడతావు...'

'ఇక్కడ కాదురా నిన్ను అవమానపరిచేది... ఇక్కడ నీకు స్థానబలిమి ఎక్కువ. రేపు ఈపాటికి చౌరస్తాలో నిన్ను నేను అవమానపరచకపోతే చూడు...!'

'ఏమిటీ? మంగమ్మననుకుంటున్నావా... శపథం చేస్తున్నావా... నన్ను అవమానపరచడం నీ వల్ల కాదు...!' ఎగతాళిగా 'ఛాలెంజ్' అన్నాడు భాస్కర్.

'ఛాలెంజ్... రేపు ఈపాటికి గోల్కొండ చౌరస్తాలో నిన్ను బిచ్చం ఎత్తుకునేట్లు చేయకపోతే నా పేరు వినీలే కాదు...'

'ఏమిటి... నన్ను బిచ్చం ఎత్తుకునేట్లు చేస్తావా... వాట్ ఎ జోక్...!' అని విరగబడిన భాస్కర్ మర్నాడు పది గంటలకు గోల్కొండ చౌరస్తాలోని దృశ్యం చూసి నవనాడులూ కుంగిపోయి అవమానంతో కుంచించుకుపోయాడు.

మర్నాడు నిద్ర లేస్తుండగానే ఫోన్... 'హలో భాస్కర్ గారూ... ఇదేమిటి... రాత్రికి రాత్రి...!' అని అవతలి నుంచి విన్న మాటలకు భాస్కర్ అదిరిపోయాడు... అలా భాస్కర్ బ్రేక్‌ఫాస్ట్ చేసి ఫ్యాక్టరీకి బయలుదేరేలోగా ఇరవై ఫోన్ కాల్స్ వచ్చాయి సేమ్ మేటర్‌తో.

గబగబా మారుతీ జెన్‌లో గోల్కొండ చౌరస్తా చేరుకున్నాడు. రోడ్డుకు ఓ పక్కగా జనం గుమిగూడి వున్నారు. భాస్కర్ కారు ఓ పక్కగా పార్క్ చేసి గుమిగూడిన జనంలోంచి చోటుచేసుకుని లోపలికెళ్లాడు.

రోడ్డు మీద గాంధీ, ఏసు బొమ్మలు గీసి ముష్టివాళ్లు ముష్టి అడుక్కున్నట్లు... రంగురంగుల చాక్‌పీసులతో భాస్కర్ బొమ్మ రోడ్డు మీద గీసి వుంది. బొగ్గుతో నల్లటి జుట్టు గీసి వుంది భాస్కర్ తలకు. భాస్కర్ చిత్రం జీవకళ వుట్టిపడుతున్నది.

'ఒక రాత్రిలో ధనం, సంపదనంతా పోగొట్టుకున్న బికారి' అని చిత్రం కింద రాసి వుంది. వినీల పక్కన కూర్చుని వుంది.

జనం ఆ చిత్రం మీదికి చిల్లర వర్షం కురిపిస్తున్నారు.

భాస్కర్‌లో రక్తం గడ్డకట్టుకుపోగా, చిత్రంలోని భాస్కర్ లేచి వచ్చి నిల్చున్నట్లుగా బొమ్మలా నిలబడిపోయాడు.

జనం అంతా 'చిత్రం భళారే విచిత్రం' అని మెచ్చుకుంటూ వెళ్తున్నారు. ○